సాక్షి
మంచిర్యాల
శనివారం, 1, జూన్, 2024

పొగాకుతో అనేక అనర్థాలు

బెల్లంపల్లిరూరల్: పొగాకుతో అనేక రకాల అనర్థాలు కలుగుతాయని బెల్లంపల్లి ఇంచార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో రవికిరణ్, ఇంచార్జి పీవోఎన్‌సీడీ శివ ప్రతాప్ అన్నారు. పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం తాళ్లగురిజాల పీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డెమో వెంకటేశ్వర్లు, వైద్యురాలు ఎవంజలీన్, సీహెచ్‌వోలు లింగారెడ్డి, ప్రభాకర్, హెచ్ఈవో సమ్మయ్య, డీపీవో ప్రశాంతి పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంచార్జి కమిషనర్‌గా మసూద్‌అలీ

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ ఇంచార్జి కమిషనర్‌గా మసూద్ అలీ నియామకం అయ్యారు. ఇప్పటివరకు కమిషనర్‌గా పని చేసిన గోపు మల్లారెడ్డి శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో మున్సిపల్ డీఈగా పని చేస్తున్న మసూద్ అలీని ఇంచార్జి కమిషనర్‌గా నియమించారు. కాగా, ఉద్యోగ విరమణ చేసిన మల్లారెడ్డిని మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సన్మానించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
43.0 /32.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఆగ్నేయం దిశగా వేడిగాలులు బలంగా వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బ్యాక్‌వాటర్ ముంపు రైతులకు మంత్రి భరోసా



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

చెన్నూర్: అన్నారం బ్యారేజీ బ్యాక్ వాటర్‌తో నష్టపోతున్న రైతులకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భరోసానిచ్చారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి చెన్నూర్ మండలంలోని ముంపు గ్రామాల రైతులతో కలిసి హైదరాబాద్‌లో మంత్రికి వినతిపత్రం అందజేశారు. గత ఐదేళ్లుగా మండలంలోని బీరెల్లి, ముత్తరావుపల్లి, సుందరశాల, నర్సక్కపేట, దుగ్నపల్లి, వెంకంపేట రైతులు బ్యాక్‌వాటర్‌తో పంటలు ముంపునకు గురై తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి ఆయకట్టు నిర్మాణానికి రూ.200 కోట్లు మంజూరుకు హామీనిచ్చారని ఎమ్మెల్యే వివేక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హిమవంతరెడ్డి, సుందరశాల, బీరేల్లి, దుగ్నెపల్లి, వెంకంపేట, నర్సక్కపేట రైతులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు ఉదయం ఫస్టియర్ పరీక్షలకు 2,037 మంది విద్యార్థులకు గాను 1,924 మంది హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 1,986 మందికి గాను 1,883 మంది హాజరుకాగా 103మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 51 మందికి గాను 41 మంది హాజరు కాగా 10 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షలకు 1,021 మందికి గాను 977 మంది హాజరు కాగా 44 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 967 మందికి గాను 927 మంది హాజరు కాగా 40 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 54 మందికి గాను 50 మంది హాజరు కాగా నలుగురు గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు డీఐఈవో శైలజ తెలిపారు.

ఏడాదిలోపు అందుబాటులోకి ఆస్పత్రి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ మంచిర్యాలకు మెడికల్ కాలేజీ మంజూరు చేశారని, మంచిర్యాల మార్కెట్ యార్డులో 10 ఎకరాల భూమిలో ప్రారంభించామని, అందులోనే నిర్మిస్తున్న నూతన ఆసుపత్రి భవనం ఏడాదిలోపు అందుబాటులోకి వస్తుందని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులో చేపట్టిన 450 బెడ్‌ల ఆసుపత్రి భవన నిర్మాణ పనులను శుక్రవారం ఆయన బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఆసుపత్రి భవన నిర్మాణం త్వరగా పూర్తి చేసేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సాగె వెంకటేశ్వర్‌రావు, సుంకరి రమేశ్, శ్రీపతి బాపు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు సిద్ధం



స్ట్రాంగ్ రూంలో భద్రపర్చిన ఈవీఎంలు(ఫైల్)

- ఎన్నికల సిబ్బందికి పలుమార్లు శిక్షణ
- ఓట్ల లెక్కింపునకు అధికారుల ఏర్పాట్లు
- 144 సెక్షన్ విధింపు, మద్యం అమ్మకాలు బంద్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: లోక్‌సభ ఎన్నికల ఫలితాల ప్రక్రియకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తోంది. తొలిసారిగా జిల్లా పరిధిలోనే పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి సెగ్మెంట్ల ఓట్ల లెక్కింపు జరుగుతోంది. ఈ నెల 4న కౌంటింగ్ కోసం జిల్లా అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. పెద్దపల్లి జిల్లా పరిధిలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలైన పెద్దపల్లి, ధర్మపురి, రామగుండం, మంథని ఓట్ల లెక్కింపు మాత్రం ఆ జిల్లా పరిధి రామగిరి మండలం సెంటినరీ కాలనీలో ఉన్న జెఎన్‌టీయూలో జరగనుంది. ఇక జిల్లాకు సంబంధించి మూడు నియోజకవర్గాల ఓట్లు హాజీపూర్ మండలం ముల్కల్లలోని ఐజా ఇంజినీరింగ్ కాలేజీలో లెక్కిస్తారు. పోలింగ్ ముగిసిన రోజే స్ట్రాంగ్ రూంలో ఈవీఎంలు భద్రపరిచి.. కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. నిరంతరం సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే కౌంటింగ్ ప్రక్రియపై అధికారులకు శిక్షణ ఇచ్చారు. భారీ బందోబస్తు మధ్య ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు ప్రణాళికతో వెళ్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్, సీపీ శ్రీనివాసులు పలుమార్లు స్ట్రాంగ్‌రూం సందర్శించారు. ఎన్నికల కమిషన్ నుంచి వస్తున్న ఆదేశాలను కిందిస్థాయి అధికారులు, సిబ్బందికి సూచిస్తున్నారు. ఇప్పటికే పలుమాలర్లు కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్షలు, సమావేశాలు నిర్వహించారు.

పోలీసు, ఎన్నికల సిబ్బందే కీలకం

కౌంటింగ్, ఫలితాల వెల్లడి వరకు పోలీసు, ఎన్నికల సిబ్బంది జాగ్రత్తగా ఉండనున్నారు. భారీ బందోబస్తు మధ్య ఎన్నికల కౌంటింగ్ జరగనుంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 6గంటల నుంచే కౌంటింగ్ ప్రక్రియ మొదలు కానుంది. 6.30గంటలకు ఈవీఎంలను తెరిచి ఏజెంట్ల సమక్షంలో అప్పగించడం నుంచి వీవీ ప్యాట్‌లో ఓటరు స్లిప్పుల లెక్కింపుతో ప్రారంభమవుతుంది. ప్రతీ సెగ్మెంట్‌కు ఓ హాల్ చొప్పున మూడు వేర్వేరు గదులు ఏర్పాటు చేశారు. ప్రతీ అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఐదు చొప్పున పోలింగ్ కేంద్రాల స్లిప్పులు లాటరీ పద్ధతిన తీసి లెక్కిస్తారు. ఇక పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లోక్‌సభ పరిధి మొత్తం కలిపి పెద్దపల్లి పరిధిలోనే లెక్కిస్తారు. జిల్లాలో కేవలం ఈవీఎంలో మీటా నొక్కుతూ రౌండ్ల వారీగా ఓట్లు లెక్కించనున్నారు. ఇందుకోసం ముందు రోజే ఎన్నికల సిబ్బందిని కౌంటింగ్ కేంద్రానికి తరలించనున్నారు. ఆ మేరకు అక్కడే వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఇక రాజకీయ నాయకులు, అనుచరులు, కౌంటింగ్ కేంద్రానికి సమీపంలో ఎవరూ రాకుండా నియంత్రించనున్నారు. ట్రాఫిక్ ఇబ్బంది, పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశారు. ఇక కౌంటింగ్ రోజు 144సెక్షన్, అమలు, మద్యం విక్రయాలు నిలిపివేయనున్నారు.



స్ట్రాంగ్ రూం ముందు పోలీసు బందోబస్తు

మంచిర్యాల సెగ్మెంట్ 21రౌండ్లు

మూడు నియోజకవర్గాల్లో 741 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ప్రతీ పోలింగ్ కేంద్రానికి బ్యాలెట్ యూనిట్, ఒక కంట్రోల్ యూనిట్, ఒక వీవీప్యాట్‌ను రౌండ్ల వారీగా ఏజెంట్లు, సిబ్బంది అన్నీ సజావుగా సాగేలా శిక్షణ ఇచ్చారు. మంచిర్యాల పరిధిలో 21రౌండ్లు, బెల్లంపల్లి, చెన్నూరు పరిధిలో 17రౌండ్ల చొప్పున లెక్కింపు జరగనుంది. ఇందు కోసం ఒక్కో సెగ్మెంట్‌కు 14టేబుళ్ల చొప్పున ప్రతీ టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్‌తోపాటు ఒక సూక్ష్మ పరిశీలకుడిని నియమించారు. ప్రతీ 15మంది టీం చొప్పున మూడు సెగ్మెంట్లకు మొత్తం 45మందిని ఎంపిక చేశారు. వీరికి అదనంగా మరో 9మంది చొప్పున రిజర్వ్‌టీంను నియమించారు. ఎవరైనా అందుబాటులో లేకపోయినా, విశ్రాంతి తీసుకున్నా వీరు కౌంటింగ్‌లో పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి పొరబాట్లకు జరగకుండా ప్రతీది సరి చూసుకుంటున్నారు.

ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ బి.సంతోష్



కలెక్టరేట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాట్లు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ బి.సంతోష్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ ఏఓ రాజేశ్వర్, సీ సెక్షన్ పర్యవేక్షకులు సంతోష్, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్‌తో కలిసి వేడుకల ఏర్పాట్లు పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి ప్రభుత్వ ఆదేశాల మేరకు వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

4న ఓట్ల లెక్కింపు

ఈ నెల 4న ఓట్ల లెక్కింపు సజావుగా సాగేలా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో జర్నలిస్టులతో కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని మూడు సెగ్మెంట్లకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రం ముల్కల్ల లోని ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనుమతి కలిగిన వారిని మాత్రమే లోనికి పంపిస్తామని, మీడియా సెంటర్ ఏర్పాటు చేశామని, రౌండ్ల వారీగా ఫలితాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

నకిలీ విత్తనాలు చేరకుండా చర్యలు

జిల్లాలో బీటీ-3 రకం విత్తనాలు రైతులకు చేరకుండా చర్యలు తీసుకుంటున్నామని, పాత నేరస్తులు, వ్యాపారులపై ప్రత్యేక నిఘా ఉంచామని, ఫర్టిలైజర్ దుకాణాలు ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నామని కలెక్టర్ సంతోష్ తెలిపారు. జిల్లాలో 1.60 లక్షల ఎకరాల్లో పత్తి సాగు విస్తీర్ణం ఉండనుందని, ఎకరానికి 2 ప్యాకెట్ల చొప్పున 3.20 లక్షల విత్తనాల ప్యాకెట్లు అవసరమని, ఇప్పటి వరకు 2 లక్షల విత్తనాల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. జిల్లాలో విత్తనాల కొరత లేదని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ.. సర్వే

- కేంద్రాల పరిధిలో ఇంటింటా వివరాల సేకరణ
- ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌లో నమోదు
- పౌష్టికాహారం పంపిణీ పక్కదారి పట్టకుండా..



ఇంటింటి సర్వే చేస్తున్న అంగన్‌వాడీ టీచర్

మంచిర్యాలటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులకు పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా ఐసీడీఎస్ అధికారులు జిల్లాలో కుటుంబ సర్వే నిర్వహిస్తున్నారు. ఆయా కుటుంబాల్లోని గర్భిణులు, చిన్నారులు, కిశోర బాలికలు, దివ్యాంగుల వివరాలు న్యూట్రీషియన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టమ్(ఎన్‌హెచ్‌టీఎస్) యాప్‌లో నమోదు చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారంతోపాటు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. కోడిగుడ్లు, పాలు, బాలామృతం, భోజనం పంపిణీలో లోపాలు చోటు చేసుకుంటున్నాయనే ఆరోపణలు వస్తున్నందున వాటిని అరికట్టేందుకు, పౌష్టికాహారం లబ్ధిదారులకు పక్కాగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల్లో కుటుంబ సర్వే చేపట్టింది. ఎన్‌హెచ్‌టీఎస్ యాప్ ద్వారా అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్నారు. జిల్లాలో గత నెలలో ప్రారంభించినా టీచర్లు ఎన్నికల విధుల్లో బూత్ స్థాయి అధికారులుగా పని చేయడంతో సర్వేలో కొంత జాప్యం జరిగింది. కొన్ని ప్రాంతాల్లో ఇంకా సర్వే కొనసాగిస్తుండగా.. పూర్తి చేసిన వివరాలను యాప్‌లో నమోదు చేయడంతోపాటు పోషణ్ ట్రాకర్ యాప్‌లోనూ నమోదు చేయాల్సి ఉంది.

నమోదుతో ప్రయోజనం

అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో కుటుంబ సర్వే ద్వారా లబ్ధిదారుల గుర్తింపుతోపాటు వివరాలు నమోదు చేస్తే ప్రయోజనం చేకూరనుంది. ఇంటింటి సర్వేలో యజమాని పేరు, కుటుంబ సభ్యుల వివరాలు, వయస్సు, ఫోన్‌నంబరు, పుట్టిన తేదీ, ఆధార్‌నంబరు యాప్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో లబ్ధిదారులకు అందించే పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా ఉండే అవకాశం ఉంది. అంగన్‌వాడీ కేంద్రాలకు గర్భిణులు, బాలింతలు, చిన్నారులు రాకపోయినా టీచర్లు హాజరు వేసేవారు. కానీ యాప్ ద్వారా లబ్ధిదారులు రాని పక్షంలో సంబంధిత లబ్ధిదారులకు భోజనం తీసుకెళ్లలేదని, చేయలేదనే వివరాలతో మెస్సేజ్ వారి ఫోన్‌నంబరుకు వెళ్తుంది. చిన్నారులకు అందించే పౌష్టికాహారం వివరాలు, వయస్సు వారీగా పోషకలోపం, తీవ్ర పోషకలోపం, ఎత్తుకు తగిన బరువు లేకపోవడం, బరువుకు తగిన ఎత్తు, వయస్సుకు తగిన బరువు, ఎత్తు లేకపోవడం వంటి వివరాల లెక్క తేలుతుంది.

జిల్లాలో..

అంగన్‌వాడీ కేంద్రాలు	969
గర్భిణులు	4,434
చిన్నారులు	41,477
సర్వే చేసిన కుటుంబాలు	1,55,315
నమోదు చేసిన గర్భిణులు	2,704
నమోదు చేసిన బాలింతలు	1,906
ఆరేళ్లలోపు చిన్నారులు	34,711

పక్కదారికి చెక్ పడేలా

అంగన్‌వాడీ కేంద్రాల్లోని లబ్ధిదారులకు గుడ్లు, పాలు, పౌష్టికాహారం, బాలామృతం తప్పనిసరిగా అందించాలి. వీటిని పొందిన చిన్నారుల్లో పౌష్టికాహార లోపం ఉండకూడదు. జిల్లాలో ప్రతీ నెల చిన్నారుల బరువు, ఎత్తు, భుజం చుట్టు కొలతల వివరాలు నమోదు చేసినప్పుడు పౌష్టికాహార లోపంతో ఉన్నట్లు గుర్తిస్తున్నారు. ఈ వివరాలు పక్కాగా చేయడం లేదనే ఆరోపణలున్నాయి. జిల్లాలోని కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు కేంద్రాలకు రాకుండానే ఆయాలతోనే నడిపిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఆయాలకు పూర్తి స్థాయిలో సరుకులను టీచర్లు అప్పగించకపోవడంతో మధ్యాహ్నం భోజనానికి ఏదో ఒకటి వండి చిన్నారులు, గర్భిణులకు పెడుతున్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయి. కొందరు టీచర్లు, ఆయాలు పౌష్టికాహారం సక్రమంగా అందించడం లేదనే విమర్శలకు ఇకపై యాప్ ద్వారా చెక్ పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

వారంలోపు పూర్తి చేస్తాం



అంగన్‌వాడీ టీచర్లు ఎన్నికల విధులు నిర్వర్తించడం వల్ల జిల్లాలో చేపట్టిన కుటుంబ సర్వే ఆలస్యం అవుతోంది. వారం రోజుల్లోపు పూర్తి చేసి వివరాలన్నీ యాప్‌లో నమోదు చేస్తాం. దీనివల్ల అంగన్‌వాడీ కేంద్రం ద్వారా లబ్ధిదారులకు అందించే సరుకులు, పౌష్టికాహారంలో ఎలాంటి అవకతవకలు జరిగేందుకు వీలుండదు. పకడ్బందీగా పూర్తి వివరాలు తెలియడంతోపాటు లబ్ధిదారులకు మెస్సేజ్ రూపంలోనూ అందుతుంది.

– చిన్నయ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి

ఫ్రైడే.. అగ్నిగుండం



భీమారం: నిర్మానుష్యంగా చెన్నూరు-మంచిర్యాల జాతీయరహదారి

- భీమారంలో రెండో రోజు 47.1డిగ్రీలు నమోదు
- రెడ్ జోన్‌లో 11 మండలాలు
- రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు



బెల్లంపల్లిలో ఎండ వేడిమికి పిట్ట మృతి



మృతుడు భీమయ్య(ఫైల్)

మంచిర్యాలఅగ్రికల్చర్/భీమారం: జిల్లాలో ఎండలు దంచి కొడుతున్నాయి. రికార్డు స్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రోజురోజుకు వడదెబ్బ మృతుల సంఖ్య పెరిగిపోతోంది. భానుడి ఉగ్రరూపానికి గత మూడు నెలల నుంచి ఇప్పటివరకు 14మంది చనిపోయారు. వారం రోజులుగా ఎండలతో ఉక్కపోత, వడగాలులతో జనం అల్లాడిపోతున్నారు. భీమారంలో శుక్రవారం రెండో రోజు 47.1డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలో 11మండలాల్లో ఉష్ణోగ్రతలు 45డిగ్రీల నుంచి 47డిగ్రీలకు చేరడంతో రెడ్‌జోన్‌లోకి వెళ్లాయి. ఏడు మండలాల్లో 43 నుంచి 45డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు సైతం 40 డిగ్రీలు నమోదవుతుడడంతో రాత్రిపూట భరించలేకపోతున్నారు. ఉదయం 10గంటలు దాటిందంటే చాలు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావడం లేదు. చిన్నారులు, వృద్ధులు, కష్టజీవులు వడగాలులతో అల్లాడిపోతున్నారు. బొగ్గుగనుల వద్ద పరిస్థితి ఇంకా దారుణంగా తయారైంది. ఓపెన్ కాస్టు ప్రాంతాల్లో అత్యధికంగా 50 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో విధులకు హాజరు శాతం తగ్గి ఉత్పత్తిపై ప్రభావం పడుతోంది. కార్మికులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. ఉష్ణోగ్రతలు 50కి చేరువ అవుతుండడంతో లే ఆఫ్ ప్రకటించాలని కోరుతున్నారు. విద్యుత్ వినియోగం పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక భారం పడడంతో కాలిపోతున్నాయి. మరో మూడు రోజులు సూర్యుని ప్రభావం ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. రోహిణి కార్తె ఆగమనంతో ఎండ తీవ్రతకు రోళ్లు బద్దలవుతాయనే నానుడిని గుర్తు చేస్తోంది.

వడదెబ్బతో కూలీ మృతి

కాసిపేట: మండల కేంద్రానికి చెందిన వ్యవసాయ కూలీ దుర్గం భీమయ్య(55) శుక్రవారం వడదెబ్బతో మృతిచెందాడు. ఉదయం పనులకు వెళ్లి వచ్చాడు. మధ్యాహ్నం తర్వాత వాంతులు, విరేచనాలు అయ్యాయి. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే క్రమంలో చనిపోయాడు.

ఇలా వచ్చి.. అలా వెళ్తారు..!

- ఇదీ ఆర్టీఏ కార్యాలయ ఏఓ తీరు
- వరంగల్ నుంచి రైల్లో రాకపోకలు
- వాహనదారులకు అందని సేవలు



శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఖాళీగా ఉన్న ఏఓ కుర్చీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో నాలుగు రోజులకు రూటర్ సమస్య పరిష్కారమై వాహనదారులకు సేవలు అందుబాటులోకి వచ్చాయి. కార్యాలయ పరిపాలన అధికారి(ఏఓ) ఇలా వచ్చి అలా వెళ్తుండడంతో పనులు పెండింగ్ పడుతున్నాయి. వరంగల్‌కు చెందిన ఏఓ స్వర్ణలత 2022 జనవరి 19న హన్మకొండ ఆర్టీఏ కార్యాలయం నుంచి బదిలీపై మంచిర్యాలకు వచ్చారు. అప్పటి నుంచి ఆమె వరంగల్ నుంచి మంచిర్యాలకు రైల్లో రాకపోకలు సాగిస్తున్నారు. రోజువారీగా రైలు ప్రయాణం సాగిస్తుండగా భోజన విరామ సమయానికి వచ్చి విధుల్లో చేరకుండా కాలక్షేపం చేస్తూ బాధ్యతలు చేపడుతారు. మధ్యాహ్నం 3.30గంటలకు వరంగల్‌కు ఉండే రైల్లో వెళ్తున్నారు. దీంతో ఆ సమయం వరకు మాత్రమే పనులు చేసి మిగతా పనులు వాయిదా వేస్తున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం..

జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఏఓ కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. సెక్యూరిటీ గార్డు నుంచి మొదలు హోంగార్డు, పోలీసు కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్ విధులతోపాటు కార్యాలయ సిబ్బంది విధులు పర్యవేక్షించాల్సి ఉంటుంది. నాన్ ట్రాన్స్‌పోర్టు వ్యవహారాలపై పూర్తి పర్యవేక్షణ బాధ్యత ఏఓపై ఉంటుంది. రిజిస్ట్రేషన్లు, లైసెన్స్ అప్రూవ్, పర్మిట్ అప్రూవ్, సీసీ వ్యవహారాలు ఇలా ప్రధాన సేవలన్నీ ఏఓ లేనిదే ముందుకు సాగవు. కార్యాలయం హెల్ప్‌డెస్క్, ఆర్టీఐ అప్పిలేట్ అధికారి బాధ్యతలూ ఉంటాయి. మొత్తంగా జిల్లా రవాణా శాఖ అధికారి తర్వాత పూర్తి బాధ్యత ఏఓదే ఉంటుంది. ఇలాంటి కీలక పాత్ర పోషించాల్సిన ఏఓ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సిబ్బందితోపాటు వివిధ సేవల కోసం వచ్చే వాహనదారులతో మొండిగా వ్యవహరిస్తూ పలు కొర్రీలతో పనులు చేయడం లేదని ఆరోపణలు ఉన్నాయి.

అయినా తీరు మారలేదు..

నాలుగు రోజులుగా కార్యాలయంలో ఇంటర్‌నెట్ రూటర్ సమస్యతో వాహనదారుల సేవలు నిలిచిపోయాయి. గురువారం సేవలు పునరుద్ధరణతో వాహనదారులు వెల్లువెత్తుతున్నారు. ఏఓ ఉదయం 10:30 గంటలకు రావాల్సి ఉండగా శుక్రవారం మధ్యాహ్నం 1:30 గంటల వరకు కూడా రాకపోవడంతో పలువురు తమ పనుల కోసం నిరీక్షించారు. గురువారం కొన్ని పనులు పూర్తి చేయకుండానే రైలు సమయం కావడంతో వెళ్లిపోగా.. శుక్రవారం ఆలస్యంగా వచ్చారు. అప్పటికే స్లాట్‌ల సమయం ముగిసిపోవడంతో గురు, శుక్రవారాల్లో ఏఓ పనులు మళ్లీ పెండింగ్ అయ్యాయి. శుక్రవారం ఓ సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ సెలవులో ఉండగా వాహనదారులకు సత్వర సేవలు అందించాల్సిన ఏఓ అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఏఓ విధులపై మంచిర్యాల ఇంచార్జి డీటీఓ సంతోష్‌ను సంప్రదించగా.. ఏఓ విధుల నిర్లక్ష్యంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, సమయానికి కార్యాలయంలో ఉండాలని సూచించామని తెలిపారు.

ఎన్‌హెచ్‌-63 పాత అలైన్‌మెంటు అమలు చేయాలి



మాట్లాడుతున్న విశ్రాంత ఎస్ఈ నారపరెడ్డి

పాతమంచిర్యాల: ఎన్‌హెచ్-63 పాత అలైన్‌మెంటు అమలు చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు, నీటిపారుదల శాఖ రిటైర్డు ఎస్ఈ నారపరెడ్డి, హాజీపూర్, లక్సెట్టిపేట మండలాల రైతులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నూతన అలైన్‌మెంటు వల్ల హాజీపూర్, లక్సెట్టిపేట మండలాల్లోని రైతులు భూములు కోల్పోయి తీవ్ర అన్యాయం జరుగుతోందని తెలిపారు. 2018అలైన్‌మెంటుతో రహదారి నిర్మించాలని, రియల్టర్లు, వ్యాపారులకు లబ్ధి చేకూర్చడానికే అలైన్‌మెంటు మార్చారని అన్నారు. ఆర్మూర్ నుంచి క్యాతనపల్లి వరకు రహదారి నిర్మాణానికి రూ.4,800 కోట్లు కాగా.. ప్రస్తుత రహదారిని విస్తరించి నిర్మిస్తే రూ.1,200 కోట్లతో పూర్తి చేయవచ్చని సాంకేతిక నిపుణులు చెబుతున్నా జాతీయ రహదారి అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అలైన్‌మెంటు మార్చి అంచనా వ్యయాలను పెంచిన అధికారులపై సీబీఐ, విజిలెన్స్ విచారణ జరిపించాలని, భూసేకరణ నోటిఫికేషన్లు నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హాజీపూర్, లక్సెట్టిపేట మండలాల రైతులు పెట్టెం తిరుపతి(ఇటిక్యాల), రాజమౌళి(గుడిపేట), వొడ్నాల శ్యాం సుందర్(గుడిపేట), మల్లేష్(నర్సింగాపూర్), జనార్దన్‌రెడ్డి(సూరారం), కొండల్‌రెడ్డి(నర్సింగాపూర్) పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలప వేలం

లక్సెట్టిపేట: మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో ఉన్న పాత కలప తలుపులు, కిటికీలు, దూలాలను వేలం వేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శైలజ ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాల శిథిలావస్థకు చేరగా నూతన భవనం నిర్మిస్తున్నందున అందులోని తలుపులు, కిటికీలను వేలం వేయడానికి నిర్ణయించినట్లు పేర్కొన్నారు. జూన్ 1వ తేదీన 11 గంటల లోపు వేలంలో పాల్గొనేవారు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రావాలని కోరారు.

ముగ్గురిని గాయపరిచిన వీధి కుక్క



వీధి కుక్క దాడిలో చేతి బొటన వేలిని పోగొట్టుకున్న బాధితుడు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలో వీధి కుక్క స్వైర విహారం చేసింది. చున్నంబట్టి వాడ కమాన్ చౌరస్తా వద్ద నలుగురిపై దాడి చేయగా, ఒకరి చేతి బొటన వేలిని కొరికి పట్టుకుపోయింది. మరో ముగ్గురిని గాయపరిచింది. వివరాలు.. చున్నంబట్టి వాడలో నివాసముంటున్న మార్బుల్ పనులు చేసుకునే తాళ్లపెల్లి ప్రసాద్ చేతి వేలును శుక్రవారం కుక్క కొరికి వెళ్లింది. అతడిని మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీధి కుక్కను స్థానికులు తరమడంతో అది పారిపోయింది. కాగా, కాలనీ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వీధికుక్కను పట్టుకోవాలని వారు కోరుతున్నారు.

బెల్లంపల్లిలో ఒకరికి గాయాలు..

బెల్లంపల్లి: ఇంటి ఎదుట కుర్చీలో కూర్చుని సేద తీరుతున్న ఓ వ్యక్తిపై వీధి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన శుక్రవారం బెల్లంపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాలబస్తీకి చెందిన మెక్కొండ శ్రీనివాస్ తన ఇంటి ఎదుట కుర్చీలో కూర్చుని సేద తీరుతున్నాడు. అటుగా వచ్చిన ఓ వీధి కుక్క ఒక్కసారిగా శ్రీనివాస్ కాలి పాదాన్ని కరిచింది. రోడ్డు వరకు గుంజే ప్రయత్నం చేసింది. ఈ ఘటనలో శ్రీనివాస్ పాదం దాడి చేసిన కుక్కను తరిమేశారు. గాయాలపాలైన శ్రీనివాస్ వెంటనే స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



మంటల్లో కాలుతున్న పూరిల్లు

దండేపల్లి: మండలంలోని మాదాపూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో శనిగారపు లక్ష్మికి చెందిన పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. రజక వృత్తి చేసుకుని జీవించే లక్ష్మి ఉతికిన బట్టలు అప్పగించేందుకు ఇంటినుంచి ఊళ్లోకి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చేసరికి మంటలు అంటుకుని పూరిల్లు కాలిపోతోంది. ఆమె కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. జన్నారం ఫైర్‌స్టేషన్‌కు సమాచారమిచ్చారు. ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలు ఆర్పివేసింది. ప్రమాదంలో లక్ష్మి ఇంట్లోని బీరువా, బట్టలు, ఫ్రిజ్, ఫ్యాన్లు, ఇతర వస్తువులు, రూ.లక్ష నగదు, 2తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు పూర్తిగా కాలిపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు వేడుకుంది.

ఆర్జీయూకేటీలో అడ్మిషన్ల కోసం..



బాసర ట్రిపుల్‌ఐటీ

- నేటి నుంచే దరఖాస్తుల స్వీకరణ
- అధికారిక వెబ్‌సైట్‌లో పూర్తి సమాచారం
- ఎస్సెస్సీ బోర్డు సర్వర్‌తో అనుసంధానం
- ఈ విద్యాసంవత్సరంలో 1,500 సీట్లు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో 2024–25 విద్యాసంవత్సరానికి శనివారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ ఏడాది ఆన్‌లైన్‌లో దరఖాస్తు విధానాన్ని ఎస్సెస్సీ బోర్డు సర్వర్‌తో అనుసంధానం చేశారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థి హాల్‌టికెట్ నంబర్, పేరు తదితర వివరాలు ఆటోమేటిక్‌గా ప్రత్యక్షమవుతాయి. జూన్ 1నుంచి 22 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు.

ఆన్‌లైన్ సెంటర్లలో..

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు మీ సేవా కేంద్రాలు, ఆన్‌లైన్ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవచ్చు. వెబ్‌సైట్ తెరవగానే నమోదు చేయాల్సిన వివరాలు స్క్రీన్‌పై కనిపిస్తాయి. జీపీఏ ఆధారంగా ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను చూసి అడ్మిషన్ కమిటీ సీట్లు కేటాయించనుంది. వేల సంఖ్యలోనే ట్రిపుల్‌ఐటీకి దరఖాస్తులు వస్తున్నాయి. ఇందులో కేటగిరీల వారీగా సీట్లు భర్తీచేస్తారు. విద్యార్థుల జీపీఏ, సామాజికవర్గం, ఇతర వివరాలు తెలుసుకుని సీట్లు కేటాయిస్తారు. ఇతర ఏ వివరాలున్నా కళాశాలలో సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు. బాసర ట్రిపుల్‌ఐటీలో గ్రామీణ విద్యార్థులకే ఎక్కువ సంఖ్యలో సీట్లు దక్కుతున్నాయి. మొదటి రెండేళ్లు ఇంటర్ తత్సమాన పీయూసీ కోర్సు బోధిస్తారు. పీయూసీలో వచ్చిన మెరిట్ ఆధారంగా ఇంజినీరింగ్ సీట్లు కేటాయిస్తారు. నాలుగేళ్ల బీటెక్‌లో సివిల్, కెమికల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్ ఐటీ, ఈసీఈఎంఎంఈ కోర్సులు అందిస్తున్నారు. సీట్లు దక్కించుకుని ప్రవేశం పొందిన విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. చదువుకునే సమయంలో ల్యాప్‌టాప్, దుస్తులు, విద్యాసామగ్రి ఇస్తున్నారు. హాస్టల్, భోజన వసతి యూనివర్సిటీయే కల్పిస్తోంది.

ఈ ఏడాది 1,500 సీట్లు..

బాసర ట్రిపుల్‌ఐటీలో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల నోటిఫికేషన్ విడుదలైంది. జూన్ 1నుంచి 22వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ట్రిపుల్‌ఐటీ వీసీ, ప్రొఫెసర్ వెంకటరమణ తెలిపారు. ఈ ఏడాది 1,500 సీట్లు భర్తీ చేయనున్నారు. పదో తరగతిలో విద్యార్థులు సాధించిన జీపీఏ ఆధారంగా సీట్లు భర్తీచేస్తారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.450, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.500 దరఖాస్తు ఫీజు చెల్లించాలని వీసీ వెంకటరమణ తెలిపారు. వివరాల కోసం www.rgukt.ac.in లేదా 7416305245, 7416058245, 7416929245 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

షెడ్యూల్ ఇలా..

- ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ జూన్ 1నుంచి 22 వరకు
- స్పెషల్ కేటగిరీ విద్యార్థులు డౌన్‌లోడ్ చేసిన దరఖాస్తులను సమర్పించేందుకు గడువు జూన్ 29
- ప్రొవిజన్ సీట్ల కేటాయింపు (స్పెషల్ కేటగిరీ కాకుండా) జూలై 3
- సర్టిఫికెట్ వెరిఫికేషన్ జూలై 8

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య



కుమారుడితో విజయలక్ష్మి (ఫైల్)

మందమర్రిరూరల్: వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మందమర్రి పట్టణంలో చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మందమర్రి ఫస్ట్ జోన్‌కు చెందిన మర్రి గౌతమ్ ఓపెన్ కాస్ట్ గనిలో డంపర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా, గౌతమ్‌కు భీమదేవరపల్లి మండలం కొప్పూర్‌కు చెందిన అరుకాల విజయలక్ష్మి (23) అలియాస్ ప్రణతితో 2020 ఆగస్టు 5న వివాహమైంది. విజయలక్ష్మి తల్లిదండ్రులు వరకట్నం కింద రూ.25 లక్షలు, 20 తులాల బంగారం గౌతమ్‌కు ముట్టజెప్పారు. వీరికి సంతానంగా రెండున్నరేళ్ల కుమారుడు రూపేశ్‌చంద్ర ఉన్నాడు. కొద్దిరోజులుగా గౌతమ్ అదనపు కట్నం కోసం విజయలక్ష్మిని తరచూ వేధిస్తూ కొట్టేవాడు. దీంతో ఆమె తల్లిదండ్రులు కొప్పూర్‌కు తీసుకువెళ్లి ముల్కనూరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గౌతమ్ పలువురు పెద్ద మనుషులతో ముల్కనూర్‌కు వచ్చి మరోసారి వేధించనని ఒప్పందం చేసుకుని విజయలక్ష్మిని మందమర్రికి తీసుకువచ్చాడు. కానీ, అతడి ప్రవర్తనలో మార్పు రాలేదు. కొద్దిరోజులకే మళ్లీ వేధింపులు ప్రారంభించాడు. గురువారం గౌతమ్ ఫోన్ చేసి రూ.50 వేలు కావాలని విజయలక్ష్మి తల్లిదండ్రులను అడగగా.. తప్పకుండా ఇస్తామని వారు చెప్పారు. కాగా, గురువారం రాత్రి ఇంట్లో విజయలక్ష్మి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. విజయలక్ష్మి తల్లిదండ్రులకు సమాచారం అందించి గౌతమ్‌తో పాటు కుటుంబసభ్యులకు రక్షణ కల్పించారు. మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి ఆరుగురిపై కేసు నమోదు చేశారు. కాగా, విజయలక్ష్మి మృతిపై ఆమె తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గౌతమ్, అతడి కుటుంబసభ్యులు వేధించడంతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని విజయలక్ష్మి తండ్రి రాజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారిపై చర్యలు తీసుకోకుంటే మృతదేహాన్ని మందమర్రి నుంచి తీసుకువెళ్లేది లేదని భీష్మించుకుకూర్చున్నారు. పెళ్లి సమయంలో ఇచ్చిన కట్నానికి రెట్టింపు చెల్లించాలని, గౌతమ్ పేరిట వచ్చే వారసత్వపు ఆస్తిలోంచి వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా, ఇరుపక్షాలు పెద్దల సమక్షంలో ఒప్పందం చేసుకున్నారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్ సమక్షంలో శవపంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిర్వహించాక విజయలక్ష్మి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించగా వారు కొప్పూరుకు తీసుకువెళ్లారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య



శ్రీకాంత్ మృతదేహం

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుందరసాల గ్రామానికి చెందిన ముంజం శ్రీకాంత్(24) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై మజీద్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాంత్‌కు ఇద్దరు అన్నలు, ఒక అక్క ఉంది. తండ్రి చంద్రయ్యకు మతిస్థిమితం లేదు. శ్రీకాంత్ తరచూ మద్యం సేవించేవాడు. 'నిత్యం మద్యం తాగితే నీకు వివాహం ఎలా అవుతుంది' అని తల్లి బానక్క మందలించింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన శ్రీకాంత్ గురువారం రాత్రి పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి తల్లికి చెప్పాడు. వెంటనే అతడిని 108లో చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కాశీలో ఇద్దరు మృతి

- తండ్రి అస్తికలు కలిపేందుకు వెళ్లి ఒకరు..
- తొమ్మిది నిద్రలు చేసేందుకు వెళ్లి మరొకరు..
- ఇద్దరి అంత్యక్రియలు అక్కడే..



గొరారెడ్డి (ఫైల్)



కనకమహాలక్ష్మి (ఫైల్)

చెన్నూర్: కాశీ దర్శనానికి వెళ్లిన చెన్నూర్ పట్టణానికి చెందిన ఇద్దరు రెండురోజుల వ్యవధిలో మృతి చెందడం వారి కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. కాశీ క్షేత్రంలో తొమ్మిది నిద్రలు చేసేందుకు వెళ్లి ఒకరు, తండ్రి అస్తికలు కలిపేందుకు వెళ్లి మరొకరు మృతి చెందారు. ఇద్దరి అంత్యక్రియలు కాశీలోనే నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అస్తికలు కలిపేందుకు వెళ్లి..

చెన్నూర్ పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో నివాసముంటున్న గొడిసెల గొరారెడ్డి (58) తన తండ్రి అస్తికలను కలిపేందుకు అన్నదమ్ములు, కుటుంబ సభ్యులతో కలిసి గత బుధవారం కాశీకి వెళ్లారు. కాశీలోని గంగానదిలో అస్థికలు కలిపారు. అక్కడే లాడ్జిలో బస చేశారు. కాగా, గొరారెడ్డి గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. గొరారెడ్డికి గతంలో బైపాస్ సర్జరీ అయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గొరారెడ్డి కుమారులు విదేశాల్లో ఉన్నారు. శుక్రవారం కుమారులు కాశీకి చేరుకుని అంత్యక్రియలు నిర్వహించారని కుటుంబ సభ్యులు తెలిపారు.

నిద్ర చేసేందుకు వెళ్లి..

చెన్నూర్ పట్టణంలోని పాత సినిమా టాకీస్ సమీపంలో నివాసముంటున్న కనకమహాలక్ష్మి(70) కుటుంబ సభ్యులతో పదిరోజుల క్రితం కాశీలో తొమ్మిది నిద్రలు చేసేందుకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాశీక్షేత్రంలో తొమ్మిది నిద్రలు చేశారు. పదోరోజు గురువారం రాత్రి చెన్నూర్‌కు తిరుగు ప్రయాణం అయ్యేందుకు సిద్ధమయ్యారని బంధువులు తెలిపారు. అందరితో మాట్లాడుతూ.. కనకమహాలక్ష్మి ఒకేసరి కిందపడి పోగా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కమకమహాలక్ష్మి కుమారుడు బాలు చెన్నూర్ మండలంలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. కుమారుడితో పాటు కోడలు, బంధవులు అక్కడే ఉన్నారు. హైదరాబాద్‌లో ఉన్న కుమార్తె శనివారం కాశీకి చే రుకున్న తర్వాత అంత్యక్రియలు నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు.

అన్ని సంఘాలను ఆహ్వానించాలి

శ్రీరాంపూర్: జూన్ 2న నిర్వహించే తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలకు సింగరేణి యాజమాన్యం అన్ని కార్మిక సంఘాలను ఆహ్వానించాలని టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్, మాజీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు బండి రమేశ్, పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, అన్వేశ్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. కోడ్ ఆఫ్ డిసిప్లిన్ ప్రకారం ఇప్పటికీ గుర్తింపు సంఘం పత్రం ఇవ్వనందున అన్ని సంఘాలను సమానంగా గుర్తించి వేడుకలకు ఆహ్వా నించాలన్నారు. దీనిపై యజమాన్యం చర్చించి సా నుకూల నిర్ణయం తీసుకుని పారిశ్రామిక శాంతిని కాపాడాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ఎన్నో కేసులు జైలు పాలైన కార్మికులను గుర్తించి వారిని అవతరణ వేడుకల్లో సన్మానించాలని కోరారు.

ఉపాధి పనికి వెళ్తూ తిరిగిరాని లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి



స్నానం రామన్న (ఫైల్)

జన్నారం: ఉపాధిహామీ పనికి వెళ్తున్న కూలీ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన ఘటన మండలంలోని ఇందన్‌పల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై రాజవర్ధన్, మృతుడి కుమారుడు రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇందన్‌పల్లి గ్రామానికి చెందిన స్నానం రామన్న (57) శుక్రవారం ఉదయం తన ద్విచక్రవాహనంపై గ్రామ సమీపంలోని చెరువు వద్దకు ఉపాధిహామీ పనికి వెళ్తున్నాడు. ఈక్రమంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొనడంతో రామన్న కింద పడగా, తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను వెంటనే 108 ద్వారా లక్సెట్టిపేట ఆస్పత్రికి, అక్కడి నుంచి వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు రామన్న మృతికి కారణమైన టీకం పగ్గుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య గతంలోనే మృతి చెందగా, ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మంచిర్యాలక్రైం: రామగిరి ప్యాసింజర్ రైలులో ప్రయాణిస్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి (65) స్పృహ కోల్పోయి ఉండడంతో స్థానిక రైల్వేస్టేషన్‌కు రాగానే అతడిని జీఆర్‌పీ పోలీసులు దింపి పరిశీలించారు. కాగా, అప్పటికే అతడు మృతి చెందటంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి వద్ద చిల్లర పైసలు ఉండంతో చిత్తు కాగితాలు ఏరుకునేవాడు లేదా రైళ్లలో భిక్షాటన చేసేవ్యక్తిగా భావించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ సంపత్ తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద ఒకరు మృతి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్లాస్టిక్ సామగ్రి సేకరించి అమ్ముకుంటూ జీవనం సాగించే శ్రీను అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. శ్రీను మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. శ్రీనుకు సంబంధించిన కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే స్థానిక పోలీస్‌స్టేషన్లో సంప్రదించాలని తెలిపారు. వివరాలకు 8712656535, 8712656534 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ఆశ్రమ పాఠశాలల్లో ఏర్పడ్డ మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేసి పాఠశాలల పునఃప్రారంభానికి సిద్ధం చేయాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సంక్షేమాధికారులు, ఏటీడీవోలు, ఏసీఎంవోలు, జీసీడీవోలు, క్రీడల అధికారులు, పీఎంఆర్సీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మరమ్మతులకు అవసరమైన కనీస మొత్తాన్ని అందజేస్తామన్నారు. విద్యార్థులకు తాగునీరు, స్నానపు గదులు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం తదితర సూక్ష్మ మరమ్మతులు చేయాలని సూచించారు. ఏటీడీవోలు, ప్రత్యేక అధికారులు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పనులు జరిగేలా చూడాలని ఆదేశించారు. బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, రోజువారీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులందరినీ జూనియర్ కళాశాలల్లో చేర్పించేలా చూడాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనన్నారు. పీవీటీజీ విద్యార్థులను హయత్‌నగర్ ప్రభుత్వ ప్రతిభ కళాశాలల్లో చేర్పించాలని సూచించారు. నాణ్యమైన సరుకులను ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేయాలని జీసీసీ అధికారులను ఆదేశించారు. పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, రికార్డుల్లో పొందుపర్చాలని కోరారు. సమావేశంలో ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్, రమాదేవి, గంగారాం, ఈఈ రాథోడ్ భీంరావు, జీసీసీ డీఎం రమానందం, అదనపు డీఎంహెచ్‌వో రామారావు, ఎస్‌డీసీ గంగాధర్, ఏసీఎంవోలు జగన్, ఉద్ధవ్, రాజమౌళి, శివాజీ, క్రీడల అధికారులు పార్థసారథి, మీనారెడ్డి, జీసీడీవోలు ఛాయ, శకుంతల, జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చర్యలు చేపట్టాలి



సమీక్ష నిర్వహిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: రక్షణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. శుక్రవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణ, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలపై ఏరియా అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతేడాది జరిగిన ప్రమాదాలను గుర్తెరిగి మరోసారి జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉద్యోగుల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించడం ఎంత ముఖ్యమో.. జీరో ప్రమాదాల సంఖ్య కూడా అంతే ముఖ్యమన్నారు. జూన్ 2న తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. ప్రగతి మైదానంలో జరిగే ఈ వేడుకలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఎస్వోటూజీ జీఎం పురుషోత్తంరెడ్డి, ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజెంట్ గోపాల్‌సింగ్, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్, డీజీఎంలు అరవిందరావు, ఆనంద్‌కుమార్, చిరంజీవులు, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేశ్‌బాబు, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

- నగదు, ఆభరణాల రికవరీ



విచారణ చేస్తున్న పోలీసులు (ఫైల్)

నస్పూర్: పట్టణ పరిధిలోని నాగార్జున కాలనీలోని సింగరేణి కార్మికుడి ఇంట్లో జరిగిన చోరీ కేసులో నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, ఎస్సై రవికుమార్ తెలిపారు. శుక్రవారం వారు తెలిపిన వివరాల ప్రకారం.. నాగార్జున కాలనీలోని సింగరేణి కార్మికుడు గుమ్మడి సత్తయ్య ఈ నెల 27న సెకండ్ షిఫ్ట్ డ్యూటీకి వెళ్లాడు. అతడి భార్య సాయంత్రం వాకింగ్‌కు వెళ్లింది. ఇంటిలో అతడి మనుమరాలు ఉన్నది. కాగా, మనుమరాలు హైదరాబాద్‌లో చదువుకుంటోంది. వేసవి సెలవుల నిమిత్తం తాతయ్య ఇంటికి వచ్చింది. ఆ యువతికి ఏడాది క్రితం ఆన్‌లైన్‌లో పరిచమైన యువకుడితో స్నేహం ఏర్పడి అది ప్రేమగా మారింది. ఇద్దరు పెళ్లి చేసుకుందామని నిర్ణయించుకున్నారు. పథకంలో భాగంగా తాతయ్య ఇంటిలో నగదు, బంగారం చూసిన యువతి సదరు యువకుడికి తెలిపింది. ఈ నెల 27న తాతయ్య డ్యూటీకి, అమ్మమ్మ వాకింగ్‌కు వెళ్లగా యువతి ఒక్కతే ఇంటిలో ఉండి యువకుడికి ఫోన్ చేసి చెప్పింది. యువకుడు వెనకాల గోడ దూకి ఇంటిలోకి వచ్చాడు. ఇద్దరూ కలిసి బీరువా పగులగొట్టి రూ 4.5 లక్షల నగదు, సుమారు 15 తులాల బంగారం, 30 తులాల వెండి దొంగిలించారు. ఈ సొత్తుతో యువకుడు గోడదూకి పారిపోయాడు. యువతి ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లి వాకింగ్‌కు వెళ్లి వస్తున్న అమ్మమ్మతో కలిసి ఏమీ తెలియనట్లుగా ఇంట్లోకి వచ్చింది. అమ్మమ్మ బెడ్‌రూంలోకి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి ఉంది. అందులో నగదు, బంగారం, వెండి ఆభరణాలు కనబడకపోయేసరికి దొంగతనం జరిగినట్లు గుర్తించి చుట్టుపక్కల వారి సహాయంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఫింగర్ ప్రింట్, జాగిలాలు, సీసీ కెమెరాలు, మొబైల్ ఫోన్ డాటా విశ్లేషణ, ఇతర సాంకేతికతను ఉపయోగించి ఆధారాలతో నిందితులను పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ 4.25లక్షల నగదు, 15 తులాల బంగారు, 30 తులాల వెండి ఆభరణాలు, ఒక పల్సర్ బైక్, రెండు మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. యువతీ, యువకుడిని రిమాండ్‌కు తరలించారు. కేసును త్వరగా ఛేదించిన సీఐ అశోక్, ఎస్సైలు రవికుమార్, జితేందర్, క్రైం టీం ఇమాజ్, నరేందర్, సిబ్బంది సతీశ్, శ్రీనివాస్‌ను సీపీ శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు.

దానాపూర్‌లో పోడుభూముల లొల్లి

- అటవీ అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు



గ్రామంలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్న రైతులు

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ మండలం దానాపూర్ గ్రామంలో శుక్రవారం పోడు భూముల లొల్లి కొనసాగింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన 60 మంది రైతులు కొన్ని సంవత్సరాలుగా 200 ఎకరాల భూమి సాగు చేసుకుంటున్నారు. గతేడాది అటవీశాఖ అధికారులు గ్రామానికి వెళ్లి భూములు స్వాధీనం చేసుకుంటామని తెలుపగా గ్రామస్తులు ఒప్పుకోలేదు. గ్రామస్తులతో చర్చలు జరిపి 12 ఎకరాలు తీసుకుంటామని తెలుపగా 12 ఎకరాలు భూమిని రైతులు వదిలేశారు. వాటిలో చెట్లు నాటినట్లు గ్రామస్తులు తెలుపుతున్నారు. ఈ సంవత్సరం మళ్లీ వచ్చి 80 ఎకరాల భూమి వదిలేయాలని అంటున్నారని ఆరోపిస్తున్నారు. దానాపూర్ గ్రామంలో మొత్తం 42 కుటుంబాలు 200 ఎకరాల వరకు కొంతకాలంగా సాగు చేసుకుంటున్నారు. సాగు చేస్తున్న భూమిని ఇప్పుడు వదిలేయాలని అంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్, ఆసిఫాబాద్ డిప్యూటీ రేంజ్ అధికారి అప్పలకొండ, డిప్యూటీ రేంజ్ అధికారి యోగేస్, బీట్ అధికారి రవి వెళ్లగా ఊర్లోనే గ్రామస్తులు అడ్డుకున్నారు. గతంలోనే భూములు చూస్తామంటూ వచ్చి 12 ఎకరాలు తీసుకున్నారని, ప్రస్తుతం మరోసారి భూములు చూడడానికి ఒప్పుకోమని అడ్డు తగిలారు. అయితే గ్రామస్తుల దగ్గర ఏవైనా పత్రాలు ఉన్నాయా? అని అటవీ అధికారులు అడగగా, తాము బీసీకి చెందిన వారం కా వడంతో ఎలాంటి పత్రాలు లేవని, అయినప్పటికీ భూములు వదులుకునే ప్రసక్తే లేదని చెప్పారు. ఒకవేళ అటవీ అధికారులు లాక్కోవడానికి ప్రయత్నిస్తే ఉద్యమం చేస్తామంటూ హెచ్చరించారు. జిల్లాలో పోడు భూముల లొల్లి యథావిధిగా కొనసాగుతోంది.

ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకే విత్తన రాజకీయం

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకే ప్రతిపక్షాలు విత్తన రాజకీయం చేస్తున్నాయని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేశ్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు విత్తన దుకాణాలకు వెళ్లి డీలర్లతో మాట్లాడారు. అంతకుముందు జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్యను కలిసి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని, అవసరమైన విత్తనాలు తెప్పించేందుకు చొరవ చూపాలని కోరారు. రైతులు ఒకే రకం విత్తనాలను కోరడంతోనే ఇలాంటి పరిస్థితి ఎదురవుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విత్తన కొరతను తీర్చేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతోందన్నారు. డీలర్లు బ్లాక్ మార్కెట్‌కు విత్తనాలు తరలిస్తే కఠిన చర్యలు చేపట్టాలన్నారు. ఒకే రకం విత్తనాలు కాకుండా వేర్వేరు విత్తనాలు వాడడంతోనే దిగుబడి వస్తుందని శాస్త్రీయంగా నిరూపితమైందన్నారు. రైతులు అపోహలకు గురికావద్దని సూచించారు. విత్తనాల విషయంలో ప్రతిపక్షాలు అనవసర రాజకీయాలు చేస్తున్నాయని, రైతులను రెచ్చగొట్టే విధంగా చూస్తున్నాయని ఆరోపించారు. ఇటీవల ఆదిలాబాద్ పట్టణంలో లాఠీచార్జి జరిగిందన్నది అవాస్తవమని, తమది రైతుపక్షపాతి ప్రభుత్వమని తెలిపారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉండగా రైతులను నయవంచనకు గురిచేసిందని ఆరోపించారు. ఆయన వెంట కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గంగాధర్, సంతోష్, వెంకట్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, చరణ్‌గౌడ్, సామ రూపేశ్‌రెడ్డి తదితరులున్నారు.